క్లుప్తంగా

గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి



పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని రేగడిదోస్వాడ, షాబాద్ పశువైద్యాధికారులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ స్రవంతిలు పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని కొమరబండ, చందనవెల్లి గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువులకు గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండాలంటే గాలికుంటు టీకాలు తప్పకుండా వేయించాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు తదితరులున్నారు.

ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల డిమాండ్

చేవెళ్ల: గుర్తింపు లేకుండా నడుస్తున్న వివేకానంద ఇంటర్‌నేషనల్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. చేవెళ్లలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మండల విద్యాధికారి అక్బర్ నిర్లక్ష్య వైఖరి కారణంగా ఇలాంటి పాఠశాలలు కొనసాగుతున్నాయని ఎంఈఓపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఈ ఏడాది ఈ పాఠశాల యాజమాన్యం విద్యార్థుల అడ్మిషన్లు తీసుకొని వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తోందన్నారు. గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని విద్యార్థులను పరీక్షలకు అనుమతించటం లేదని ఆందోళన చేశారన్నారు. అడ్మిషన్ల కోసం అనేక మాయమాటలు చెప్పి అడ్మిషన్లు పొందిన తరువాత మోసం చేస్తున్నారన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి తనిఖీలు చేసి విద్యార్థుల జీవితాలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరిక



లక్ష్మమ్మకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

కేశంపేట: ఎమ్మెల్సీ ఉపఎన్నికల నేపథ్యంలో మండలంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జోరందుకున్నాయి. ఇటీవల మండల పరిధిలోని చౌలపల్లి ఎంపీటీసీ బీఆర్‌ఎస్‌ను వీడి సొంత పార్టీలోకి చేరిన విషయం విధితమే. గురువారం మండల పరిధిలోని లేమామిడి ఎంపీటీసీ దిద్దేల లక్ష్మమ్మ సంగెం గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అబ్బి సుందరయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, శ్రీధర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, పాండు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడోత్సవాలు

ఆమనగల్లు: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నెహ్రూ యువకేంద్రం సహకారంతో నిర్వహించిన మండల స్థాయి క్రీడోత్సవాలు ముగిశాయి. రన్నింగ్, వాలీబాల్, ఖోఖో క్రీడలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ఎంపీడీఓ ఫారుక్‌హుస్సేన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీఈటీలు జ్యోతి, ఆనంద్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం పసుమాములలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను గురువారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సర్వే నెంబర్ 386లోని ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిసిన సమాచారం మేరకు తహసీల్దార్ రవిందర్‌దత్తు సిబ్బందిని అక్కడికి పంపించారు. దీంతో అక్కడ వెలిసిన అక్రమనిర్మాణాలను జేసీబీ సహాయంతో అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని అక్రమించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

‘పది’కి పక్కా ప్రణాళిక

- మెరుగైన ఫలితాలే లక్ష్యంగా చర్యలు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ఈ నెల 18 నుంచి వార్షిక పరీక్షలు



తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

షాబాద్: ఇన్నాళ్లూ వారివారి పాఠశాలల్లోనే వార్షిక పరీక్షలు రాశారు. పదో తరగతికి చేరి తొలిసారి బోర్డు పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల్లో కాస్త ఒత్తిడి, భయం ఉండటం సహజం. కానీ పరీక్షలు సమీపిస్తున్న వేళ ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికాబద్ధంగా చదివితేనే మంచి మార్కులు వస్తాయంటున్నారు ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు. పదో తరగతి బోర్డు పరీక్షలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్నా యి. ఇక చదివింది ఒక ఎత్తు అయితే. ఈ నాలుగు రోజుల్లో చదవడాన్ని కీలకంగా భావించాల్సి ఉంటుందన్నారు. ఆంగ్లం, గణితం, సైన్స్, సోషల్, సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించాలంటే పక్కా ప్రణాళిక అవసరం అంటున్నారు. ఆయా సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులు సలహాలు ఇచ్చారు.

ఒత్తిడిని జయించాలి..

బోర్డు పరీక్షలకు హాజరుకావడం తొలిసారి అయినందున విద్యార్థులు ఆందోళనకు గురవుతుంటారు. ఇవి కూడా పాఠశాలల్లో రాసిన పరీక్షలుగా భావించి ఒత్తిడిని దూరం చేసుకోవాలి. పరీక్షల్లో విజయం తమదేనని నమ్మకంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చేస్తున్న సూచనలను పాటిస్తూ ముందుకు సాగితే మంచి జీపీఏ సాధించడం సులభమే. ప్రశాంత వాతావరణంలో ఉదయం 5 గంటలకే లేచి చదివితే మంచిది. అదేవిధంగా సబ్జెక్టులోని కీలక అంశాలను ఎప్పటికప్పుడు నోట్స్‌గా రాస్తే పాయింట్ల వారీగా పరీక్షల్లో రాసేందుకు అవకాశం ఉంటుంది. పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో పది జీపీఏ లక్ష్యంగా విద్యార్థులు ముందుకెళ్తున్నారు. పదిలో వందశాతం ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ముందస్తు ప్రణాళిక, హార్డ్‌వర్క్‌తోనే లక్ష్యాన్ని చేరుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నాగిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థులు పరీక్షలు అనే యుద్ధానికి సిద్ధమవుతున్నారు. ఆత్మవిశ్వాసంతో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తామని విద్యార్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ముందస్తుగా అవగాహన..

పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులకు పాఠశాలల్లో ముందస్తుగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రైవేట్‌కు దీటుగా పాఠశాలల్లో ఉదయం పూట, సాయంత్రం పూట అదనంగా 1గంట పాటు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 9కి పైగా జీపీఏ సాధించేందుకు ఉదయం, సాయంత్రం క్లాసులు నిర్వహిస్తున్నారు. రోజుకో పరీక్ష నిర్వహించి బిట్స్ ఎలా రాయాలో పేపర్‌ను తయారు చేసి అవగాహన కల్పిస్తున్నారు. అన్ని సబ్జెక్టులపై సమాన దృష్టి పెట్టి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నారు.

9.8 జీపీఏ సాధిస్తా..



పదిలో ఉత్తమ ప్రతిభ కనబర్చేందుకు స్టడీ అవర్స్ మొదలు పెట్టారు. 9.8 జీపీఏ సాధించేందుకు ప్రయత్నిస్తాను. అన్ని సబ్జెక్ట్‌లపై సమాన దృష్టి పెట్టి పరీక్షలకు సిద్ధమవుతున్నాను.

–మధుసూదన్, విద్యార్థి, 10వతరగతి, తాళ్లపల్లి జెడ్పీ పాఠశాల

ప్రత్యేక ప్రణాళిక



జిల్లా అధికారులు రూపొందించిన ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వ హిస్తున్నాం. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థు లను గుర్తించి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం. ప్రతీ రోజు ఓ టీచర్‌ను నియమించి స్పెషల్ తరగతులు నిర్వహిస్తున్నాం. ఉపాధ్యాయుల కృషి ఫలితంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా శ్రమిస్తాం.

–నాగిరెడ్డి, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, తాళ్లపల్లి

ప్రశ్నలపై అవగాహన అవసరం



విద్యార్థులు ప్రశ్నాపత్రాలపై అవగాహన కలిగి ఉండాలి. పార్ట్–ఏ, పార్ట్–బీలో ఏమేం ప్రశ్నలు వస్తాయి.. వాటికి ఎన్ని మార్కులు ఉంటాయో తెలుసుకోవాలి. పేరగ్రాఫ్‌లు ఇచ్చి ప్రశ్నలు అడిగితే ఒకటికి రెండు సార్లు చదివి అర్థం చేసుకున్నాకే సమాధానం రాయాలి. చదివిన అంశాన్ని అర్థం చేసుకుంటే సులభంగా పరీక్ష రాయొచ్చు. కొన్ని ప్రశ్నల్లో చార్టు ఆధారంగా జవాబులు రాయాల్సి ఉంటుంది. ఇంగ్లిష్‌లో గ్రామర్ అత్యంత కీలకం. సమాధానాలు రాసే సమయంలో తప్పులు లేకుండా చూసుకోవాలి.

–సంగమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, తాళ్లపల్లి

పది జీపీఏ లక్ష్యం



పది జీపీఏ లక్ష్యంగా చదువుతున్నాను. ఉదయం, సాయంత్రం రోజూ పుస్తకాలతో కుస్తీ పడుతున్నాను. ఎలా చదవాలో, ఎందులో ఎక్కువ స్కోరింగ్ చేస్తామో టీచర్లు అవగాహన కల్పిస్తున్నారు.

–స్వాతి, విద్యార్థిని, 10వ తరగతి, తాళ్లపల్లి జెడ్పీ పాఠశాల

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు

మొయినాబాద్: చిలుకూరు రెవెన్యూలో విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని చిలుకూరు మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి, గ్రామస్తులు ఆరోపించారు. గురువారం మాజీ సర్పంచ్ వీరభద్రస్వామి, గ్రామస్తులు జొన్నాడ రాజు, జకరయ్య, మల్లేశ్ తదితరులతో కలిసి ‘సాక్షి’తో మాట్లాడారు. చిలుకూరు రెవెన్యూలో ప్రభుత్వ భూములను ఇష్టానుసారంగా కబ్జాలు చేస్తున్నా రెవెన్యూ యంత్రాంగం స్పందించడం లేదన్నారు. గతంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, శాసనకర్తలు సైతం కబ్జాదారులకు సహకరించారని ఆరోపించారు. సర్వే నెంబర్ 787లో 22 ఎకరాలు, 632లో 30 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. 166 సర్వే నెంబర్‌లో వేదపాఠశాలకు కేటాయించిన భూమిలో 3 ఎకరాలు, 786లో 4 ఎకరాలు, 196లో 2 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందన్నారు. 277, 283 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరిగాయన్నారు. ఉస్మాన్‌సాగర్ చెరువు శిఖంలో అక్రమ నిర్మాణాలు, వరద కాలువలు కబ్జాకు గురయ్యాయన్నారు. మొయినాబాద్ నుంచి చిలుకూరు పెద్ద చెరువులోకి వచ్చే వరద కాలువను పూడ్చేసి పైపులు వేయడంతో మురుగునీరంతా చెరువులో చేరుతుందని తెలిపారు. భూములను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని.. అందుకు తమవంతు సహకారం అందిస్తామని అన్నారు. 277 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై తహసీల్దార్ గౌతమ్‌కుమార్ కేసులు నమోదు చేయడం శుభపరిణామమన్నారు. ప్రభుత్వ భూములు కాపాడే అధికారులకు తమవంతుగా సహకరిస్తామన్నారు.



మాట్లాడుతున్న వీరభద్రస్వామి, గ్రామస్తులు

కాంగ్రెస్ నాయకుల బైక్ ర్యాలీ



కేశంపేట: ర్యాలీలో స్కూటీ నడుపుతున్న జెడ్పీటీసీ విశాలశ్రావణ్‌రెడ్డి



కొందుర్గు: ఉత్తరాసిపల్లి వద్ద బైక్ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ నుంచి మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా నిలబడిన చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపు కోసం కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. గురువారం మండల పరిధిలోని సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, అల్వాల, కేశంపేట, వేములనర్వ, ఇప్పలపల్లి, పాపిరెడ్డిగూడ గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో..

కొందుర్గు: కాంగ్రెస్ పార్టీ చేపట్టిన బైక్ ర్యాలీ గురువారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు చేరుకుంది. కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కొందుర్గు మండలంలోని శ్రీరంగాపూర్, మహదేవ్‌పూర్, ఉత్తరాసిపల్లి, ముట్పూర్, రేగడిచిల్కమర్రి, ఉమ్మెంత్యాల, లాలపేట మీదుగా జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని లచ్చంపేట, తుమ్మలపల్లి, లాల్‌పహాడ్ మీదుగా చౌదరిగూడకు చేరుకుంది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కావలి రాజుతోపాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



నందిగామలో..

నందిగామ: వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మండలంలో ఆ పార్టీ శ్రేణులు గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిల ఆధ్వర్యంలో చేగూరు, బండోనిగూడ, బుగ్గోనిగూడ, వెంకమ్మగూడ, నర్సప్పగూడ, వీర్లపల్లి, మామిడిపల్లి, నందిగామ తదితర గ్రామాల్లో వేలాది బైక్‌లతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, ఎంపీపీ ప్రియాంక, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, ఎంపీటీసీలు కృష్ణ, దేవల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు..

మండల పరిధిలోని శ్రీనివాసులు, గూడ మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి తన అనుచరులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. అదే విధంగా మామిడిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎర్రగుంట రాంరెడ్డి, ప్రభాకర్ రెడ్డిలతో పాటు సుమారు 100 మంది కిపైగా కాంగ్రెస్‌లో చేరారు.

కొత్తూరులో..

వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు గురువారం కొత్తూరు మండలంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిల ఆధ్వర్యంలో మక్తగూడ, గూడురు, మల్లాపూర్, సిద్దాపూర్, ఎస్‌బీపల్లి, కొడిచర్ల, పెంజర్ల, తీగాపూర్ తదితర గ్రామాల్లో వేలాది బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలతో మంచి భవిష్యత్



కేశంపేట: మాట్లాడుతున్న హెచ్‌ఎం చంద్రశేఖర్

కేశంపేట: పదిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని హెచ్‌ఎం చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తేనే భవిష్యత్ బాగుంటుందని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరేందుకు పదో తరగతి మొదటి మెట్టులాంటిదన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, శిరీష, సాయిప్రసాద్, కృష్ణయ్య, చంద్రయ్య, శంకర్, హారతి, శశికళ, శ్రీనివాససాగర్, అబ్దుల్‌భారీ, రాజు, విజయశ్రీ, కవిత తదితరులు పాల్గొన్నారు.



కొందుర్గు: సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉన్నత చదువులకు పునాది

కొందుర్గు: విద్యార్థులకు పదో తరగతి ఉన్నత చదులకు పునాది లాంటిదని వైస్ ఎంపీపీ రాజేశ్ పటేల్ అన్నారు. గురువారం కొందుర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తే సమాజంలో మంచి గౌరవం ఉంటుందన్నారు. లక్ష్యం, పట్టుదలతో చదివి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నారు. ముట్పూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఎంతగానో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎంలు పుష్పలత, చెన్నారెడ్డి, దాతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

చేవెళ్ల: మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి షైమూదా అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని సీపీఐ కాలనీ ఫేజ్–2 వద్ద గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వడ్ల మంజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె ముందుగా జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జనాభాలో సగభాగమైన మహిళలకు పురుషులతో సమాన హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛ లేకుండా పోతున్నాయన్నారు. మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు వచ్చినా నేటికీ సమాజంలో మహిళలకు గౌరవం దక్కక పోగా లైంగిక వేధింపులు, వరకట్నం చావులు ఆగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలందరూ చైతన్యవంతులు కావాలని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేలా తయారు కావాలన్నారు. కార్యక్రమంలో జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, మండల కార్యవర్గ సభ్యులు లలిత, అనురాధ, యాదమ్మ, జయమ్మ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. రామస్వామి, ఏఐటీయూసీ నాయకులు సత్యనారాయణ, నాయకులు సుభాన్‌రెడ్డి, సత్తిరెడ్డి, మక్బూల్, అంజయ్య, జంగయ్య, యాదగిరి, వెంకటమ్మ, సుగుణమ్మ, అంజమ్మ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న షైమూదా

డిగ్రీ కళాశాలలో అన్ని సదుపాయాలు

చేవెళ్ల: ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు చేవెళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అందుబాటులో ఉందని, అన్ని సదుపాయాలతో బోధన ఉంటుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ఇంటర్ ద్వితీయ సంవత్సరం ముగింపు సందర్భంగా ఆయా పరీక్ష కేంద్రాల వద్ద గురువారం చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం పరీక్ష రాసి వచ్చిన విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, సీట్లు, కళాశాలలో ఉన్న సౌకర్యాలతో కూడిన కరపత్రాలను తయారు చేసి విద్యార్థులకు అందజేశారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, నూతనంగా ఏర్పాటు చేసిన కళాశాల నూతన భవనంలో విశాలమైన గదులు, వాతవారణం అందుబాటులో ఉందని చెప్పారు. ఉన్నత విద్యను అందించేందుకు అనువైన వాతవారణం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉందని చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దోస్త్ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనురాధ, రూప, వైష్ణవి, జ్యోతి, షేక్‌మహబూబ్, రవీందర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పాల బిల్లులు చెల్లించండి

పాడి రైతు సంఘం నాయకుల డిమాండ్

కడ్తాల్: పాడి రైతులకు సకాలంలో పాల బిల్లులు చెల్లించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రెండు నెలలుగా విజయ డెయిరిలో విక్రయిస్తున్న చిన్న, సన్నకారు రైతులకు బిల్లులు రావడం లేదని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ఇటీవలే పాడి రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని తెలంగాణ పాడి పారిశ్రామికాభివృద్ధి సహకార సమాఖ్య ఎండీతో సమస్యలు వివరించామన్నా రు. మొదట ఒక బిల్లు 4 రోజుల్లో విడుదల చేయిస్తామని, తదుపరి బిల్లులు 20 రోజుల్లో ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చిన విషయం గుర్తు చేశారు. నేటికీ బిల్లులు రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రూ.200 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి సకాలంలో అందజేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభు త్వం స్పందించి, పాడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడారి రామకృష్ణ, ముత్తి రంగన్నా, నర్సింహరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్, అశోక్‌రెడ్డి, కుమార్, సాయిప్రభు, దశరథ్, సత్యం, నరేశ్, రమణ, రాజేశ్, రంగ, గణేశ్, శేఖర్, గిరిధర్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత

తలకొండపల్లి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత పేర్కొన్నారు. విటమిన్లు, ప్రోటీన్లు, మిలెట్స్, తదితర పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకున్నట్లయితే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. మండల పరిధిలోని తుమ్మలకుంట తండాలో గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ.. చౌకగా దొరికె ఆకుకూరలు, కూరగాయలతో పోషకాహారాన్ని తయారు చేసి ప్రదర్శించారు. గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సెరిమాళ్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

ఆమనగల్లు: గిరిజనుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం సంత్ సేవాలాల్ మహరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి కృష్ణనాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనుకబడిన గిరిజనులను ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.